సాక్షి
విశాఖపట్నం
సోమవారం | 12 | మే | 2025



అప్పన్న సేవలో ఒడిశా దాసులు 8లో



నగరంలో నాకాబంది 8లో

న్యూస్‌రీల్

సింహాచలం ఈవోగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో(పూర్తి అదనపు బాధ్యతలు)గా దేవదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సింహగిరికి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ కంచెమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గతంలో పలుమార్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా, డిప్యూటీ ఈవోగా ఆమె విధులు నిర్వర్తించిన సంగతి తెలిసిందే..

నేడు రెండో విడత చందనం సమర్పణ



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న వైదికులు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం రెండవ విడత చందనం సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు దేవస్థానం వైదికులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల పచ్చి చందనంలో ఆదివారం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతా రామాచార్యులు, వైదికులు సుగంధ ద్రవ్యాలను కలిపారు. సోమవారం తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం చందనాన్ని సమర్పించనున్నారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్ద ఎత్తున చేరుకున్న భక్తులు

సింహాచలం క్షేత్రంలో సోమవారం వైశాఖ పౌర్ణమి ఉత్సవం కావడంతో ఆదివారం సాయంత్రానికే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు తరలివచ్చారు. వీరంతా సోమవారం కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి కొండపై వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. కోలలకు పూజలు చేసి.. సహపంక్తి భోజనాలు చేస్తారు. భక్తులతో అడవివరం పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

రేపటి నుంచి చందనం ప్యాకెట్ల విక్రయాలు

సింహాచలం: చందనోత్సవం రోజున శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై నుంచి ఒలిచిన నిర్మాల్య చందనాన్ని మంగళవారం నుంచి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ తెలిపారు. చందనం నిల్వలు ఉన్నంత వరకు, ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి చందనం ప్యాకెట్ల టోకెన్లు జారీ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఉచిత దర్శనం క్యూలో 400 మందికి, రూ.100 క్యూలో 300 మందికి, రూ.300 క్యూల్లో 300 మందికి ఒక్కో టోకెన్‌ను పది రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. స్వామి దర్శనానంతరం దక్షిణ రాజగోపురం వద్ద నుంచి బయటకు వచ్చే ప్రాంతంలో ఉన్న ప్రసాదాల విక్రయశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో టోకెన్లు ఇచ్చి చందనం ప్యాకెట్లు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో భక్తుడికి ఒక టోకెన్ మాత్రమే ఇస్తామని, భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఎంఎస్‌ఎంఈ పరీక్ష

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్(ఎంఎస్‌ఎంఈ)–సెట్ ప్రశాంతంగా ముగిసిందని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎన్.విజయమోహన్ తెలిపారు. విశాఖపట్నం, అచ్యుతాపురం కేంద్రాలుగా ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించామన్నారు. 600 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. విశాఖపట్నంలో 178 మంది, అచ్యుతాపురంలో 342 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన పర్యవేక్షణ చేశామన్నారు.

హీటెక్కించిన సన్‌డే







వేసవి తాకిడికి నగరవాసులు అల్లాడిపోయారు. ఆదివారం ఉదయం నుంచే భానుడి తాపం హీటెక్కించింది. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైకి వచ్చినవారు తమ దుస్తుల్నే నెత్తిన ఆసరాగా చేసుకున్నారు. శీతల పానీయాలు, ఫ్రూట్ జ్యూస్ దుకాణాలకు రద్దీ పెంచారు. రోజంతా వేసవి తాపానికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలు మధ్యాహ్నం నుంచే బీచ్‌కు పరుగులు తీశారు. సాయంత్రానికి తీరం జనసంద్రమైంది. రాత్రి 7 గంటల వరకూ కెరటాలతో సయ్యాటలాడుతూ సేదతీరారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఎప్పుడొస్తుందో రేషన్?

నిరీక్షణలో పేదలు



రోడ్డుపై గోనె సంచులను క్యూలో పెట్టిన రేషన్ లబ్ధిదారులు



రేషన్ కోసం శివాజీపాలెంలో చిన్నపూలమ్మ గుడి వద్ద వేచి ఉన్న వృద్ధురాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ లబ్ధిదారుల కష్టాలు అన్నీ ఇన్ని కావు. గత ప్రభుత్వం అందించిన విధంగా పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు సరఫరా చేయకపోగా.. పంపిణీ ప్రక్రియ కూడా పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. ఈ నెల 11వ తేదీ గడిచినా ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో రేషన్ సరుకులు అందని పరిస్థితి నెలకొంది. నిత్యం రేషన్ వాహనం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూపులు తప్పడం లేదు. పేదలు ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు రేషన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి శివాజీపాలెంలోని చిన్నపూలమ్మ గుడి వద్ద చోటుచేసుకున్న ఈ దృశ్యం అద్దం పట్టింది. ఇక్కడ వృద్ధులు తమ రేషన్ సరుకుల కోసం గోనె సంచులు క్యూలో పెట్టుకుని గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్ పంపిణీలో జరుగుతున్న ఈ ఆలస్యంపై లబ్ధిదారులు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



శాకంబరీ దేవిగా చిన పోలమాంబ

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామ దేవత చిన పోలమాంబ ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా 7వ రోజు ఆదివారం అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులను భక్తులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ఏర్పాట్లు చేసింది. సాయంత్రం శివాజీపాలెం విద్యుత్‌కాంతులతో వెలిగిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో సందడి నెలకొంది.

కేంద్ర హిందీ సలహా సంఘం సభ్యుడిగా ఆచార్య యార్లగడ్డ



విశాఖ విద్య: కేంద్ర వైద్య మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న హిందీ సలహా సంఘం సభ్యుడిగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర వైద్య మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు యార్లగడ్డ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నియామకం మూడేళ్ల కాలానికి వర్తిస్తుంది.

మెడికల్ మాఫియా

నిఘా.. నామ‘మాత్ర’మే!



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, ఈగల్ అధికారులు(ఫైల్)

- ఫార్మసిస్టులు లేకుండానే మెడికల్ షాపుల నిర్వహణ
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు మందుల విక్రయం
- రికార్డుల నిర్వహణకు తిలోదకాలు
- మొద్దు నిద్రలో ఔషధ నియంత్రణ శాఖ
- విజిలెన్స్ దాడుల్లో వెలుగుచూసిన వాస్తవాలు

మహారాణిపేట: నగరంలో ఔషధ విక్రయాల్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. కాలం చెల్లిన మందులు, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేని మత్తు ఇంజెక్షన్లు, దగ్గు మందుల అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఫార్మసిస్టులు లేకుండా, కనీస వైద్య పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నిర్వహిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఔషధ విక్రయాలపై సంబంధిత శాఖల పర్యవేక్షణ కొరవడటం రోగులకు శాపంగా మారింది. అనేక మందుల షాపులు ప్రాథమిక నిబంధనలను కూడా పాటించకుండా నిర్వహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 4,500 పైగా మెడికల్ షాపులు ఉండగా.. ఇందులో సుమారు 3,000 రిటైల్ షాపులు కాగా, 1,500 ఏజెన్సీలు, హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు కనీస పారదర్శకత లేకుండానే నడుస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి మందుల షాపులో ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో మందుల విక్రయాలు జరగాల్సి ఉన్నప్పటికీ.. ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. అమ్మకపు బిల్లులు ఇవ్వకపోవడం, ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు పదార్థాలు, ఇంజెక్షన్లు విక్రయించడం, సరైన రికార్డుల నిర్వహణ లేకపోవడం, కంప్యూటర్లు వాడకపోవడం వంటివి సర్వసాధారణంగా మారాయి. నొప్పి నివారణ మందులు, మత్తు కలిగించే ఇంజెక్షన్లు విచ్చలవిడిగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు

ఇటీవల మందుల విక్రయాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) అధికారులతో కూడిన 40 మంది సభ్యుల నాలుగు బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. మొత్తం 16 మందుల షాపులు, ఏజెన్సీలపై ఉదయం 10 గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ సోదాల్లో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ఈ తనిఖీల్లో రెండు షాపుల్లో కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఎంవీపీ కాలనీలోని త్యాగరాయ మెడికల్స్‌లో రూ.50 వేల విలువైన గడువు ముగిసిన మందులను, గాజువాకలోని శ్రీ సాయి వెంకటేశ్వర మెడికల్స్‌లో రూ.90 వేల విలువైన కాలం చెల్లిన మందులను అధికారులు గుర్తించారు. కాలం చెల్లిన మందులను స్వాధీనం చేసుకుని షాపులను సీజ్ చేశారు.

ఈ దాడులు మందుల విక్రయాల్లో జరుగుతున్న అక్రమాలను బహిర్గతం చేశాయి. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఔషధ నియంత్రణ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

మొక్కుబడి కేసులు

ఈ అక్రమాలపై సంబంధిత ఔషధ నియంత్రణ శాఖ నిఘా పూర్తిగా కొరవడిందని ఆరోపణలున్నాయి. ఔషధ నియంత్రణ మండలి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శ్రీనివాస్ రావు, అభిప్రియ, కూన కల్యాణి, ఎస్.కల్యాణి వంటి అధికారులు ఉన్నప్పటికీ.. తనిఖీలు, సోదాలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెలవారీ, వార్షిక తనిఖీల లక్ష్యాలను చేరుకోవడానికే ఈ శాఖ పరిమితమైందన్న విమర్శలున్నాయి.

నీ తోడే.. నా కనుచూపుగా..

- దాతల దీవెనలు.. పెద్దల ఆశీస్సులతో ఒక్కటైన అంధ జంట
- అతిథుల రాకతో కళకళలాడిన ప్రేమ సమాజం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రేమ సమాజం కమిటీ, అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ ప్రతినిధులు అమిత్ , వినిత్

డాబాగార్డెన్స్: ప్రేమ సమాజంలో ఆప్యాయత, అనుబంధాల మధ్య పెరిగిన యువతి శివజ్యోతికి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్రతో ఘనంగా వివాహం జరిగింది. ప్రేమ సమాజంలోని అన్నపూర్ణ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి 7.05 గంటలకు అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుక.. దాతృత్వం, మానవతా విలువలకు నిదర్శనంగా నిలిచింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల శుభ ధ్వనులు, దాతలు, ప్రముఖుల ఆశీస్సులతో సందడి వాతావరణం నెలకొంది. పుట్టుకతోనే కంటిచూపును, తల్లిదండ్రులను కోల్పోయిన శివజ్యోతికి ప్రేమ సమాజమే కుటుంబంగా నిలిచి ఈ వేడుక జరిపించింది.

డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజం అనాథాశ్రమంలో రెండు దశాబ్దాలుగా ఆశ్రయం పొందుతున్న శివజ్యోతి.. చినజీయర్ స్వామి అంధుల పాఠశాలలో ఇంటర్మీడియట్, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేసింది. అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన ఎనుమోలు రాఘవేంద్ర బీకాం(కంప్యూటర్) పూర్తి చేశాడు. అతనూ అంధుడే. కోయంబత్తూరులోని పీఎఫ్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రాఘవేంద్ర తనలాగే కంటి చూపులేని అమ్మాయినే వివాహం చేసుకోవాలని కోరడంతో.. ఆయన సోదరుడు రమణ ప్రేమ సమాజం ప్రతినిధులను సంప్రదించాడు. దీంతో వారు శివజ్యోతి గురించి అతనికి చెప్పడం, ఇరు వర్గాలు అంగీకరించడంతో కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది.

అండగా నిలిచిన దాతలు

ప్రేమ సమాజం నిర్వహించిన 114వ వివాహంగా ఇది చరిత్రలో నిలిచింది. అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ ప్రతినిధులు అమిత్ లోహియా, వినిత్ లోహియా సహా ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కార్యదర్శి హరి మోహన్‌రావు, కమిటీ ప్రతినిధులు మట్టుపల్లి హనుమంతరావు, విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి అప్పలరాజు, గణపతిరావు, రిటైర్డ్ ఏసీపీ దివాకర్, ఉప్పల భాస్కరరావు, స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు వంటి పలువురు ప్రముఖులు ఈ వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. దాతృత్వ స్ఫూర్తి ఈ వేడుకలో అడుగడుగునా కనిపించింది. ప్రేమ సమాజం కమిటీ శివజ్యోతికి అండగా నిలిచింది. ఆమె పేరిట రూ. లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్, ఒక తులం బంగారం(తాడు), సారె సామగ్రిని అందజేసింది. కార్యవర్గం అనుమతితో కంచర్ల అన్నపూర్ణ ఏసీ ఆడిటోరియంలో వివాహం ఘనంగా జరిగింది. అతిథులకు రాత్రి విందుతో సహా వివాహ ఖర్చులన్నీ ప్రేమ సమాజమే భరించింది. గత 14 ఏళ్లుగా ప్రేమ సమాజంలో జరిగే అనాథ బాలికల వివాహాలకు సహాయం అందిస్తున్న అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ ప్రతినిధులు అమిత్ లోహియా, వినీత్ లోహియా నాయకత్వంలో రూ.69,500 విలువైన వస్తువులను నూతన వధూవరులకు బహూకరించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ పరీక్షలు
- పరీక్షలకు హాజరుకానున్న 39,992 మంది విద్యార్థులు



ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

విశాఖ విద్య: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులతో ఆర్‌ఐవో మురళీధర్ ఆదివారం సమీక్షించారు. ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినందున, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిశితంగా పరిశీలన చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలోని 188 జూనియర్ కాలేజీల నుంచి 32,780 మంది ఫస్టియర్ విద్యార్థులు హాజరవుతున్నారు. వీరి కోసం జిల్లాలో 66 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా సెకండ్ ఇయర్ పరీక్షలకు 7,212 మంది నమోదు చేసుకోగా, వీరి కోసం 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా జిల్లాను ఏడు జోన్లుగా విభజించి, పరీక్షల పర్యవేక్షణకు తనిఖీ అధికారులను నియమించారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు, ఇతర సామగ్రిని భద్రపరిచేందుకు 14 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేలా నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

రెండు పూటలా పరీక్షలు

సోమవారం నుంచి ఈ నెల 20 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి రోజూ ఫస్టియర్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల సాయంత్రం 5.30గంటల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి జూన్ 1 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. జూన్ 4న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 6న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు.

వీర జవాన్ త్యాగం మరువలేనిది


మురళీ నాయక్‌కు వైఎస్సార్ సీపీ నేతల నివాళి



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మహారాణిపేట: పాక్ దాడిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని దేశం మరువదని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మురళీ నాయక్ చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మురళీ నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, రవి రెడ్డి, కటుమూరి సతీష్, మొల్లి అప్పారావు, కొండా రాజీవ్ గాంధీ, బానాల శ్రీనివాసరావు, రాజన్న వెంకటరావు, కటారి అనిల్ కుమార్ రాజు, షేక్ మహ్మద్ గౌస్, ఇమంది సత్యనారాయణ, పేడాడ రమణికుమారి, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, పులగం కొండారెడ్డి, సేనాపతి అప్పారావు, రామిరెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, దేవరకొండ మార్కండేయులు, నీలాపు కాళిదాస్‌రెడ్డి, కె.రామన్నపాత్రుడు, నాగేంద్ర, అప్పన్న, కొట్యాడ సూర్యనారాయణ, కనక ఈశ్వరరావు, గంగా మహేష్, పీతల వాసు, బెవర మహేష్, గోవింద్ బోదపు, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంభ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉగ్రవాద నిర్మూలనతోనే ప్రపంచ శాంతి



మాట్లాడుతున్న ఆచార్య సూర్య ప్రకాష్

విశాఖ విద్య: ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడం ద్వారానే ప్రపంచశాంతి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాష్ రావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఆదివారం ఏర్పాటు చేసిన ‘ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం–దేశ సమైక్యతను పెంపొందిద్దాం–మేరా భారత్ మహాన్’ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఉగ్రవాద నిర్మూలనకు భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి సంఘీభావం లభిస్తోందని తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా ప్రపంచ దేశాలన్నీ సమష్టిగా కలిసి పనిచేయాలని సూచించారు. ఐకమత్యమే భారతీయుల బలమని ప్రపంచం గుర్తించిందన్నారు. ప్రజలంతా దేశ భద్రతకు, అభివృద్ధికి, పటిష్టతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ భారతదేశం ఎల్లప్పుడూ శాంతిని కోరుకుంటుందని, అదే సమయంలో దేశ ప్రజలకు ముప్పు తలపెట్టేవారిని ఎంత మాత్రం ఉపేక్షించదన్నారు. దేశ భద్రత కోసం సరిహద్దులో అవిశ్రాంతంగా పనిచేస్తున్న త్రివిధ దళాల సిబ్బందికి భారతీయులంతా బాసటగా నిలవాలని కోరారు. యుద్ధంలో మృతి చెందిన తెలుగు జవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం త్రివర్ణ పతాకాలను పట్టుకుని ‘భారత్ మాతాకీ జై.. మేరా భారత్ మహాన్..’అంటూ నినాదాలు చేశారు.


పుష్పయాగానికి పూలు తరలింపు



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల పుష్పాలు

ఎంవీపీ కాలనీ: తిరుమలలోని శ్రీ కపిలేశ్వరస్వామి బిల్వ పత్ర పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలి వెళ్లాయి. ఆధ్యాత్మికవేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పూలను ఎంవీపీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద ప్రదర్శించారు. 4 వేల కలువలు, 2 వేల తామరలతో పాటు పలు రకాల పూలను సంకల్పం చేసి.. ఆదివారం సాయంత్రం తిరుమల తరలించినట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. 12వ తేదీ జరిగే బిల్వ పత్ర పుష్పయాగంలో ఈ పూలు వినియోగిస్తారు.

కడలి ఒడిలోకి..



సంద్రంలోకి వెళ్తున్న తాబేలు పిల్లలు



తాబేలు పిల్లలను విడిచి పెడుతున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: అరుదైన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను ఆదివారం ఉదయం సముద్రంలోకి విడిచిపెట్టారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పాండురంగాపురం వద్ద ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్లను సేకరించి.. ప్రత్యేక కేంద్రంలో సంరక్షించారు. ఆ కేంద్రంలో గుడ్ల నుంచి పొదిగి బయటకు వచ్చిన తాబేలు పిల్లలను సిబ్బంది సముద్రంలోకి విడిచిపెట్టారు. కాగా.. ఈ ప్రక్రియ నిత్యం జరుగుతోందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వీటిని చూడటానికి నగరవాసులు, చిన్నారులు ఎంతో ఆసక్తి చూపారు.

నగరంలో నాకాబందీ

32 కూడళ్లలో 1, 212 వాహనాల తనిఖీలు



రైల్వేస్టేషన్, బస్టాండ్లలో పోలీసుల తనిఖీలు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నగర వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, అధిక లోడు ఉన్న వాహనాలు, వాహన రికార్డుల పరిశీలన, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడి లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. మొత్తం 32 ముఖ్య కూడళ్లలో జరిగిన తనిఖీల్లో 1,212 వాహనాలను పరిశీలించారు. సరైన రికార్డులు లేని 9 వాహనాలను సీజ్ చేయగా, హెల్మెట్ ధరించని 50 ద్విచక్ర వాహనదారులపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని 5 వాహన చోదకులపై, సక్రమంగా నంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఉద్యోగం పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ: ఉద్యోగం పేరిట మోసం చేసిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. దుక్క లక్ష్మి అనే మహిళ ఎంవీపీ కాలనీ సెక్టార్–4లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. తను నివాసం ఉంటున్న కింది అంతస్తులో అమ్మ బాలుర హాస్టల్‌లో ఉండే గౌతమ్ కృష్ణ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. జీవీఎంసీలో ఉద్యోగం చేస్తున్న తన బంధువు(అంటీ) త్వరలో పదవీ విరమణ చేయబోతోంది.. ఆ ఉద్యోగం మీకు ఇప్పిస్తానంటూ లక్ష్మిని నమ్మించాడు. ఇందుకు దఫదఫాలుగా రూ.9 లక్షలు తీసుకున్నాడు. కొంత కాలంగా లక్ష్మి ఫోన్ చేస్తే, స్పందించట్లేదు. కొన్నాళ్ల తర్వాత మొబైల్ పోయిందని, అందుకే ఫోన్ ఆన్సర్ చేయలేకపోయినట్లు నమ్మించాడు. ఈ క్రమంలో ఈఎంఐ ద్వారా తనకు ఐఫోన్ కొనివ్వాలని అడగ్గా, గత ఏడాది అక్టోబర్‌లో కొనిచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఫోన్‌కు బదులివ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన లక్ష్మి, అతనిపై ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు తాతారావు

తగరపువలస: ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ తాతారావు(25) అనే యువకుడు మనస్తాపంతో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం అలవాటు ఉన్న మృతుడికి ఆ కారణంతోనే వివాహం కాకపోవడంతో ఇటీవల తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పశువుల కాపరిగా, వ్యవసాయ కూలీగా పని చేస్తున్న తాతారావు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంట్లో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నాడు. 1.30 సమయంలో సమీపంలోని అమ్మమ్మ వారి ఇంటి వద్దకు వెళ్లి, చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు ఆవేదనకు గురయ్యారు. ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి అమ్మానాన్న అప్పలకొండ, నారాయణ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3 శతాబ్దాలుగా.. అప్పన్న సేవలో ఒడిశా దాసులు

- తరతరాల కుటుంబ సంప్రదాయం.. ఒడిశా దాసుల సొంతం
- ప్రస్తుతం స్వామి సేవలో 4వ తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్



అమ్మవారి సన్నిధిలో భక్తులకు నూనె అందిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

పది.. ఇరవయ్యేళ్లు కాదు.. ఏకంగా 300 ఏళ్లకు పైనే.. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి సేవలో ఆ కుటుంబం తరిస్తోంది. ఏటా మూడు మాసాలు సింహగిరిపైనే ఉంటూ.. స్వామిని పూజిస్తూ, ఆర్జిత సేవలు చేస్తూ.. భక్తులకు ఇతోధికంగా సాయపడుతోంది. వారే ఒడిశాలోని గంజాం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన దాసుల కుంటుంబం. ప్రస్తుతం ఆ వంశానికి చెందిన నాలుగో తరం వారైన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ అప్పన్నస్వామి సేవలో తరించేందుకు సింహాచలానికి చేరుకున్నారు.



గరుడసేవలో లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంతో ఒడిశా భక్తులకు విడదీయరాని అనుబంధం ఉంది. అందులోనూ గంజాంలోని పట్టుపురం గ్రామానికి చెందిన నాయక్‌దాస్ కుటుంబానిది మరీ ప్రత్యేకం. మూడు వందల ఏళ్లకు పైనుంచే ఈ కుటుంబానికి చెందిన ఒకరు స్వామి సేవకు అంకితమవడం ఆనవాయితీ. ఏటా మూడు నెలలు సింహగిరిపై ఉండి స్వామి సేవతోపాటు, తమ వద్దకు వచ్చే భక్తులకు స్వామివారి విశిష్టతను, సింహాచల క్షేత్ర వైభవాన్ని చాటిచెప్పుంటారు.

స్వామి సేవలో నాలుగో తరం

నాలుగో తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ ప్రస్తుతం అప్పన్న సేవలో తరిస్తున్నారు. ఈయన తాతగారి పెదనాన్న ముకుంద నాయక్ దాస్ నుంచే స్వామికి వీరి కుటుంబం సేవలందించే కార్యక్రమం ప్రారంభమైంది. స్వామిపై ఉన్న ఎనలేని భక్తి కారణంగా అప్పట్లో ఒడిశా నుంచి ముకుంద నాయక్‌దాస్ సింహాచలం వచ్చేశారు. సింహగిరిపై ఓ చెట్టు క్రింద తపస్సు చేసుకుంటూ, స్వామి సేవలో తరించేవారు. కొన్నేళ్లకు కంటిచూపు మందగించడంతో తమ్ముడి కొడుకైన రుషికేష్‌నాయక్‌దాస్ ఏడేళ్ల వయసు నుంచే ఆయన వద్దకు చేరారు. తనకు 9 ఏళ్ల వయసులో పెదనాన్న పరమపదించడంతో ఆ బాధ్యతలను రుషికేష్ నాయక్‌దాస్ స్వీకరించారు. ఆయన 95 ఏళ్లపాటు స్వామి సేవలో గడిపారు.

ఒడిశా భక్తులకు ఆశ్రయం.. దాస సత్రం

రుషికేష్‌నాయక్‌దాస్ 1947లో సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయ సమీపంలో కొంత స్థలాన్ని తీసుకుని ఒడిశా నుంచి వచ్చే భక్తుల కోసం ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన మృతితో ఆయన కొడుకు బుచ్చికిషోర్ నాయక్‌దాస్ సింహాద్రి అప్పన్న సేవకు అంకితమయ్యారు. ఆ తర్వాత ఆయన తమ్ముడైన వనమాలిక్ నాయక్‌దాస్ స్వామి సేవను స్వీకరించారు. ఈయన హయాంలోనే రుషికేశ్‌నాయక్‌దాస్ శ్రీకారం చుట్టిన ఆశ్రమం దాస సత్రం నిర్మాణం పూర్తయింది. 2006లో వనమాలిక్ మృతితో ఆయన కొడుకు ప్రస్తుత దాసుడు లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ స్వామి సేవకు అంకితమయ్యారు.

300 ఏళ్లు.. ఐదుగురు దాసులు

- ముకుందనాయక్ దాస్ (ప్రారంభకులు)
- రుషికేష్‌నాయక్ దాస్ (ముకుందనాయక్ తమ్ముడి కొడుకు)
- బుచ్చికిశోర్‌నాయక్ దాస్ (రుషికేష్‌నాయక్ కొడుకు)
- వనమాలిక్‌నాయక్ దాస్ (బుచ్చికిశోర్‌నాయక్ తమ్ముడు)
- లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ (వనమాలినాయక్ కొడుకు)

ఒడిశా దాసుల సేవల్లో కొన్ని..

- ఒడిశాలోని తమ స్వగృహంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి పీఠాన్ని ఏర్పాటు చేసుకుని సింహాచల క్షేత్రంలో జరిగే నిత్య పూజాది కార్యక్రమాలన్నీ ఆచరిస్తుంటారు.
- సింహాచలం క్షేత్రంలో లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ ఉన్న మూడు నెలల్లో స్వామికి ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహిస్తారు. ఆశ్రమంలో ఏటా నృసింహ హోమాన్ని నిర్వహిస్తుంటారు.
- దాసుడి దగ్గర తమకున్న మానసిక, ఆరోగ్య రుగ్మతలు చెప్పుకుంటే అవి కచ్చితంగా నయమవుతాయని ఒడిశా భక్తుల విశ్వాసం. దానికనుగుణంగానే సింహగిరిపై ఉన్న దాస సదనంలో తమను ఆశ్రయించేవారికి దాసుడు వైద్య సేవలందిస్తారు.
- స్వామికి అంతరాలయంలో ప్రతి రోజు పూజ అనంతరం దాసుడు భక్తులకు తులసి ప్రసాదాన్ని, గంగమ్మతల్లి సన్నిధిలో దీపం వెలగించిన నూనెను ఇస్తారు. ఆ తులసి ప్రసాదం తిన్నా, నూనెను శరీరానికి, తలకు పట్టించుకున్నా రోగాలు నయమవుతాయని ఒడిశా భక్తుల విశ్వాసం.
- 2008లో సింహగిరి దివ్యక్షేత్రం పనుల్లో భాగంగా దాస సత్రాన్ని దేవస్థానం తొలగించింది. ప్రత్యామ్నాయంగా జటల్‌సాధు మఠానికి వెళ్లే దారిలో కొండపై స్థలాన్ని ఇవ్వడంతో అక్కడే లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ సత్రాన్ని నిర్మించారు. ఆ సత్రంలోనే ఈ మూడు మాసాలు ఆయన బస చేస్తారు.

అంతా స్వామి అనుగ్రహం



శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి ఎంతో మహిమాన్వితుడు. నీతి, నియమాలు పాటిస్తూ నిర్మల హృదయంతో ఆరాధిస్తే కచ్చితంగా స్వామి అనుగ్రహం లభిస్తుంది. నా తండ్రి పరమపదం వరకు నేను మామూలు వ్యక్తిగానే తిరిగాను. ఆ తర్వాత నాలో భక్తిభావం కలగడం స్వామి కృప. తరతరాల సంప్రదాయం కొనసాగించే అవకాశం ఆ స్వామి అనుగ్రహంగానే భావిస్తాను. – లక్ష్మీకాంత్ నాయక్ దాస్

జూలో సన్‌దడే సందడి



జూలో పెద్ద పులికి ఫొటోలు తీస్తున్న సందర్శకులు



ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతున్న తెల్ల పులి

పోటెత్తిన సందర్శకులు.. రూ.3.62 లక్షల ఆదాయం

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందడిగా మారింది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు రావడం, అందులోనూ ఆదివారం కావడంతో సందర్శకులు పోటెత్తారు. ఎండ తీవ్రత కారణంగా ఎక్కువ సమయం జూ లోపల చెట్ల కిందే గడిపారు. చిన్నారులు చెట్ల నీడలో గంటల తరబడి ఆటలాడుతూ ఎండ వేడిమి కాస్త తగ్గుముఖం పట్టాక జూలో వన్యప్రాణులను తిలకించారు. వాటికి ఫొటోలు తీస్తూ, ఎన్‌క్లోజర్ల వద్ద సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. ఇక్కడ ఏనుగులు, పులులు, కోతులు, జిరాఫీ, జీబ్రాలు, జింకలతో పాటు నెమళ్లు, ఆఫ్రికన్ చిలుకలు, ఆస్ట్రిచ్‌లు, ఈములు వాటి ఎన్‌క్లోజర్లలో ఉదయం, సాయంత్రం సమయంలో హుషారుగా తిరుగుతూ జూకు వచ్చిన పిల్లల్ని, పెద్దలను అలరించాయి. మొసళ్ల జోన్ కొలనులో నీరు వేడెక్కడంతో వాటిలో మొసళ్లు సాయంత్రం వరకు బయటకు రాకుండా అడుగు భాగంలోనే ఉండిపోయాయి. ఆదివారం 4,303 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వారి ద్వారా రూ 3.62 లక్షల ఆదాయం లభించిందన్నారు.

అండర్–11 చెస్ విజేతలు సార్యాజేష్, అఫ్షిన్



సార్యాజేష్‌తో తలపడుతున్న వెంకట కీరత్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా అండర్–11 చదరంగం జట్ల ఎంపిక పోటీల్లో సార్యాజేష్, అఫ్షిన్ విజేతలుగా, శశాంక్, కమలప్రియ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విశాఖ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో గాజువాక లయన్స్‌క్లబ్‌లో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఓపెన్ కేటగిరీలో ఏడు రౌండ్లలో సాగిన పోరులో 97 మంది, బాలికల కేటగిరీ ఆరు రౌండ్లలో 40 మంది పోటీపడ్డారు. ఓపెన్‌లో ఫిడే రేటింగ్ ఉన్న 9 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. ఓపెన్‌లో ఆరున్నర పాయింట్లతో ఎ.సారాజేష్(1422) విజేతగా, ఆరు పాయింట్లతో కె.శశాంక్(అన్‌రేటెడ్) ద్వితీయస్థానంలో నిలిచారు. బాలికల్లో ఐదున్నర పాయింట్లతో సమఉజ్జీగా నిలిచిన ప్రోగ్రెసివ్‌తో ఎండీ అఫ్షిన్(1480) విజేతగా, బి.కమలప్రియ(1499) ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు జిల్లా జట్టుగా ఎంపికయ్యారు.

రాజకీయ ప్రయోజనాలే బీజేపీ లక్ష్యం

- వామపక్ష పార్టీల మూడో ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ఫలించ లేదు
- సీపీఐ జిల్లా మహా సభల్లో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల



సీపీఐ జిల్లా మహా సభలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

మురళీనగర్: రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దుయ్యబట్టారు. విశాఖలోని మురళీనగర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకుంటూ, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల మధ్య చిచ్చుపెట్టి, తమ వైపు తిప్పుకొని బీజేపీ అధికారంలోకి వస్తోందని విమర్శించారు. 2014లో కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాల వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు చొప్పున వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. వీటిలో ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. 2019లో రెండోసారి అనేక కుయుక్తులతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మూడో సారి 420 సీట్లు సొంతంగా గెలుస్తామని చెప్పి, నేరుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సీట్లు తెచ్చుకోలేకపోయిందన్నారు. యూపీఏ –1 ప్రభుత్వానికి వామపక్షాలు బయట నుంచి మద్దతిచ్చి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని సరైన రీతిలో నడిపేందుకు కృషి చేసిందని, వామపక్షాల వల్లే ఉపాధి హామీ వంటి పలు చట్టాలు వచ్చాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయం కోసం వామపక్షాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. అధికారం కోసం రాజ్యాంగ సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలను రూపొందించుకుని ప్రజలతో మమేకమవడానికి పార్టీ కృషి చేయాలన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు పల్లెటి పోలయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కె.వనజాక్షి, కె.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో పార్టీ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు, పి.దుర్గాభవాని, జేవీ సత్యనారాయణమూర్తి, ఏజే స్టాలిన్, డి.ఆదినారాయణ, సీహెచ్ రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 162 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

కిడ్నాప్ ఫిర్యాదుతో కలకలం

- రోజంతా హైరానా పడ్డ పోలీసులు
- ఆర్థిక లావాదేవీలు బెడిసికొట్టడంతో తప్పుడు ఫిర్యాదు

పెందుర్తి: తన కుమారుడ్ని తన వ్యాపార భాగస్వామి కిడ్నాప్ చేశాడని ఓ మహిళ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. అయితే ఇద్దరు భాగస్వాముల మధ్య తలెత్తిన ఆర్థిక లావాదేవీల ఆరోపణలతోనే తప్పుడు ఫిర్యాదు వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పెందుర్తి అయ్యప్పనగర్‌కు చెందిన ధనరాజ్ పాటిల్, చినముషిడివాడ ప్రాంతానికి చెందిన కమోజీ సుధాకర్ కలిసి చినముషిడివాడ కేంద్రంగా శివ సాక్షిని ఎంటర్‌ప్రైజస్ పేరిట సీసీ కెమెరాలు, ఫైర్ అలారం, పైప్‌లైన్ వ్యాపారాన్ని ప్రారంభించారు. సుధాకర్‌కు లాభాల్లో 33 శాతం వాటా ఇవ్వాలన్నది ఒప్పందం. అయితే కమోజీ సుధాకర్ లాభాలు, మూలనిధి ఖాతా నుంచి రూ.15.40 లక్షలు తన ఖాతాకు మళ్లించుకోవడంతో పాటు తనకు తెలియకుండా తమ్ముడి నుంచి రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టించాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ లావాదేవీలు పరిష్కరించకుండానే సుధాకర్ ఇంటిని ఖాళీ చేసి ఎటో వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నా కొడుకుని కిడ్నాప్ చేశారు : ఇదే క్రమంలో కమోజీ సుధాకర్ తల్లి రాజేశ్వరి తన కొడుకును కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. సుధాకర్‌ను కిడ్నాప్ చేసినట్లు ఎక్కడా ఆధారాలు లేకపోవడంతో కేవలం ఆర్థిక లావాదేవీలు బెడిసికొట్టడం వలనే ఇలాంటి ఫిర్యాదులు చేసుకున్నారని నిర్ధారించినట్లు సీఐ తెలిపారు. ఇరువర్గాలు పరస్పర ఆర్థిక లావాదేవీలపై ఆరోపణలు చేసుకుంటున్నారని.. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాస్మిక్ రెస్టోబార్‌పై కేసు

టీచర్స్‌రోడ్డు: నిబంధనల ఉల్లంఘన కారణంగా మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి కాస్మిక్ హౌస్ రెస్టోబార్ పబ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడో పట్టణ సీఐ పైడయ్య తెలిపిన వివరాలు... ఈ పబ్‌కు రాత్రి 11 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయ అనుమతులున్నాయి. అయితే శుక్రవారం అర్ధరాత్రి 1:30 దాటినా పబ్ నడుస్తూనే ఉంది. దీనిపై వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అదే సమయంలో తనిఖీ చేశారు. లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించి పబ్ నడుపుతున్నట్లు తేలడంతో.. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. లైసెన్స్ ఉన్నప్పటికీ నిబంధనల మేరకే వైన్ షాపులు, బార్లు, పబ్‌లు నడపాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవాచర్ రీసెర్చ్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న విశాఖపట్నం బీఎస్ఎన్ఎల్ అధికారులు

అల్లిపురం: ఒడిశాలోని బెర్హంపూర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్–టెక్నాలజీ(ఎన్ఐఎస్‌టీ) విశ్వవిద్యాలయంలో ఈ నెల 8 నుంచి మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)ను బీఎస్ఎన్ఎల్ విశాఖ ట్రైనింగ్ పాయింట్ నిర్వహించింది. గతేడాది డిసెంబర్ 14న జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆదివారం బెర్హంపూర్‌లో పరిశోధన–ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించింది. కార్యక్రమంలో భాగంగా సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎం.సత్యప్రసాద్ ఇది బీఎస్ఎన్ఎల్ స్థాపించిన మొదటి విశ్వవిద్యాలయం అని పేర్కొన్నారు. నిస్ట్ విద్యార్థులు క్యాంపస్‌లో ఆచరణాత్మక ప్రయోగాలు, కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లను స్థాపించడానికి తోడ్పడుతుందన్నారు. అనంతరం పలు అంశాలపై సదస్సులు నిర్వహించారు.

'పల్లా అనుచరులకు నైతిక విలువలపై శిక్షణ'

భీమిలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుచరులకు సోమవారం నుంచి హోటల్ దసపల్లా వేదికగా నైతిక విలువలపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. ఆదివారం ఆయన భీమిలిలో మాట్లాడుతూ నైతిక విలువలపై సీనియర్ ప్రొఫెసర్‌తో శిక్షణా ఇప్పించి, హాజరయ్యేవారికి భోజనం కూడా పెడతామన్నారు. వైఎస్సార్‌సీపీకి కోవర్టుగా ఉన్న పల్లా నైతిక విలువలు, ప్రత్యర్థులపై సంయమనం కోల్పోకుండా ఎలా మాట్లాడాలి అనే అంశంపై ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో గోపాలపట్నం పోలీసులు (ఇన్‌సెట్‌లో బాబూరావు(ఫైల్))

గోపాలపట్నం: భార్యకు కడుపులో నొప్పిగా ఉందని మాత్రలు తీసుకొచ్చేందుకు గోపాలపట్నం వచ్చిన అక్కిరెడ్డి బాబూరావు(52)ను లారీ రూపంలో మృత్యువు కాటేసింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ఖారవేలనగర్‌కు చెందిన అక్కిరెడ్డి బాబూరావు ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం భార్యకు కడుపులో నొప్పిగా ఉందని గోపాలపట్నంలోని మందుల దుకాణానికి వచ్చాడు. ఆ సమయంలో గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, మృతుని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పెద్ద కొడుకు జగదీష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు. లారీ ఆచూకీ లభ్యమైనట్లు తెలిసింది. ఇక్కడి హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా మట్టిని తరలించేందుకు వచ్చింది. లారీ డ్రైవర్ కూడా పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.